క్లుప్తంగా

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్మార్ట్ సిటీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మానసిక, కుష్టు వ్యాధి, ఇతర పేషెంట్స్‌కు మానసిక వైద్యులు డాక్టర్ సీహెచ్ వంశీ కృష్ణ సమక్షంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ టి.అబ్రహం లింకన్, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ ఎంజెఎఫ్ ప్రగళ్లపాటి మురళీ కృష్ణలు అందజేశారు. లింకన్ మాట్లాడుతూ వేసవి కాలంలో రోగుల దాహార్తిని తీర్చేందుకు తమ క్లబ్ ద్వారా వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో పోగ్రామ్ జిల్లా మేనేజర్ ఎంజెఎఫ్ వీజీఎంఆర్ కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ఎస్వీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాంబాబు నాయక్‌కు వీడ్కోలు



రాంబాబు నాయక్‌కు వీడ్కోలు పలుకుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతిపై చింతలపూడికి బదిలీపై వెళుతున్న ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో నార్త్ సెక్షన్ ఏఈ భూక్యా రాంబాబు నాయక్‌కు మంగళవారం ఏలూరులో నార్త్ సెక్షన్ ఉద్యోగులు ఘన వీడ్కోలు పలికారు. ఉద్యోగులు, సిబ్బంది అందరినీ కలుపుకుపోయే మనస్తత్వమున్న రాంబాబు నాయక్ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు బి.దుర్గా ప్రసాద్ దొర, జీవీ మునిస్వామి, కె.ముసలయ్య, ఎ.రమేష్, ఎ.మణికుమార్, ఎ.నాని బాబు, ఎస్కే రహీమ్, బి.ప్రవీణ్, ఎ.రోశయ్య పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ



పేదలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పనులు లేక వస్తులుంటున్న యానాదులను ఆదుకోవడానికి తమ సంస్థ ముందుకొచ్చిందని నగరానికి చెందిన అహలె సున్నతుల్ జమాత్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం స్థానిక యానాదుల కాలనీలో యానాదుల కుటుంబాలకు అల్పాహారం పంపిణీ చేశారు. సమాజంలో కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ద్వారా మాత్రమే ఆత్మ సంతృప్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎండీ ఎక్బాల్, ఎండీ గాలబ్ అలీ, అబుభాయ్, ఎండీ ఆరిఫ్, ఎండీ సుల్తాన్ పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

దెందులూరు: టీ.నర్సాపురం వైఎస్సార్ సీపీ యువజన విభాగం నూతన మండల అధ్యక్షుడిగా నియమితులైన కన్నం సర్వేశ్వరరావు మంగళవారం ఏలూరు కార్యాలయంలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీ శ్రీధర్ నూతన మండల యువజన అధ్యక్షుడు సర్వేశ్వరరావుకు సూచించారు.

వామ్మో.. 304 (బి)

- వాహనదారుల గుండెలు గుబేల్
- తస్మాత్ జాగ్రత్త అంటున్న పోలీసులు
- రోడ్డు ప్రమాద కేసుల్లో ఈ సెక్షన్ వినియోగం

ఏలూరు టౌన్: 'ఒక వ్యక్తి తన మోటారు సైకిల్‌ను స్నేహితుడికి ఇచ్చాడు. అతనికి డ్రైవింగ్ లైసెన్సు లేదు. అతను వాహనంపై వెళుతూ ఎదురుగా వస్తోన్న మరో వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఎదురుగా వచ్చిన వ్యక్తి మరణించాడు. పోలీసులు వాహనం నడిపిన వ్యక్తితో పాటు వాహన యజమానిపైనా 304 (బి) కేసు నమోదు చేశారు. నాన్ బెయిలబుల్ కేసు కావటంతో వాహన యజమాని నెత్తి నోరు బాదుకున్నా ఫలితం లేదు'

'హాస్పిటల్‌లో అనారోగ్యంతో వైద్యం పొందుతున్న వ్యక్తికి నోటీసు వచ్చింది. 304 (బి) కేసు నమోదయిందని, పోలీసుల ఎదుట హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. ఇతని మోటారు సైకిల్ కొనుగోలు చేసిన వ్యక్తి తన పేరుమీద మార్పు చేసుకోలేదు. ఆ వ్యక్తి కారణంగా రోడ్డు ప్రమాదంలో ఎదుట వ్యక్తి మృతిచెందాడు. ఈ కేసులో మోటారు సైకిల్ నడిపే వ్యక్తితోపాటు, యజమానికి నోటీసులు జారీ చేశారు'

'సంక్రాంతి రోజున ఒక వ్యక్తి కొత్త మోటారు సైకిల్‌ను కొనుగోలు చేశాడు. సెంటిమెంట్‌గా తన భార్యపేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. అనంతరం కొన్ని రోజులకు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఒక రోడ్డు ప్రమాదానికి కారణమయ్యాడు. ఈ ప్రమాదానికి బాధ్యులను చేస్తూ వాహన యజమానిగా ఉన్న తన భార్యతో కలిపి ఇద్దరిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.'

ఏమిటీ సెక్షన్ 304 ఎ, బి

రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు నిర్లక్ష్యంగా వాహనం నడిపినా, ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌పై ఐపీసీ సెక్షన్ 304 (ఎ) కేసు నమోదు చేసేవారు. ఈ సెక్షన్‌లో సుమారు రెండేళ్లపాటు జైలుశిక్ష పడుతుంది. ఇటీవల రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చట్టంలో సవరణ తీసుకొచ్చింది. 304 (బి) సెక్షన్‌ను తీసుకొచ్చింది. ప్రమాదాలకు కారణమైన డ్రైవర్ లైసెన్సు లేకుండా వాహనం నడిపినా, నిర్లక్ష్యంగా ఇతరుల ప్రాణాలను తీసినట్టు భావించినా దాదాపుగా హత్య కేసుతో సమానంగా ఈ సెక్షన్‌ను సవరించారు. డ్రైవర్‌తోపాటు వాహన యజమానిపైనా కేసు నమోదు చేస్తున్నారు. గతంలో 304 (ఎ) కింద రెండేళ్ల శిక్ష పడితే.. 304 (బి) కింద గరిష్టంగా పదేళ్ల శిక్ష పడుతుంది. పైగా అరెస్టయిన వెంటనే బెయిల్ కూడా రావటం కష్టంగా మారుతుంది.



జాతీయ రహదారిపై గరుడ హోటల్ వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి (ఫైల్)

ఈ సెక్షన్‌తో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. తమ మోటారు సైకిల్‌ను, వాహనాన్ని మైనర్లకు, లైసెన్సు లేనివారికి ఇచ్చేందుకు భయంతో వణికిపోతున్నారు. లైసెన్సు లేనివారికి వాహనాన్ని ఇచ్చి జైలుపాలు కావటం ఎందుకని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం



నిత్యం రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించటం ఇలా బాధ్యతా రాహిత్యంతో ప్రమాదాలకు కారణమవుతూ ఇతరుల ప్రాణాల తీస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు గతంలోనే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. వాహనం నడిపే వారు మైనర్లు అధికంగా ఉంటున్నారు. మద్యం సేవించి ఇష్టారాజ్యంగా మోటారు సైకిళ్లు నడుపుతూ ఇతరుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. ఈ సెక్షన్‌కు భయపడి ఇతరులకు వాహనాన్ని ఇవ్వటానికి యజమానులు భయపడాలి.

– బోణం ఆదిప్రసాద్, సీఐ, ఏలూరు వన్‌టౌన్

బీసీ ఉద్యోగుల అనుబంధ సంఘాల ఏర్పాటు

ఏలూరు (టూటౌన్): ఏపీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి అనుబంధంగా ఏలూరు జిల్లా, నగర కమిటీలను ఏర్పాటు చేశామని సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మారగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా ఆరేపల్లి శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా నల్లా రామారావు, రామసూరి, హరినారాయణ, కాళిదాసు వెంకటరమణ, పోరంగి వెంకటేశ్వరరావు, తెంటు సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా ఫణి కుమార్, బల్లం సాయిరాజు, గోలి రవికుమార్, బలే రవి శోభన్ కుమార్‌లతో జిల్లా కార్యవర్గం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అక్కారపు రాజ్‌కృష్ణ, ఉపాధ్యక్షులుగా మన్నే ఉమామహేశ్వరరావు, వానపల్లి సత్యనారాయణ, కార్యదర్శిగా జొన్నాడ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా అప్పలస్వామి, పి.అప్పలరాజులను నియమించారు. ఏలూరు నగర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బూసి వరలక్ష్మి, కార్యదర్శిగా ధర్మలింగం, చింతలపూడి మండల అధ్యక్షుడిగా వీరవల్లి శ్యాం నాగేశ్వరరావు, కార్యదర్శిగా కోడూరి శ్రీనివాస్‌లను నియమించారు. నూతన కమిటీలను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కొండలరావు, జె.శ్రీనివాస్, జి.శ్రీధర్ రాజులు అభినందించారు.

యువకుల స్వచ్ఛంద రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులను అభినందిస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆపదలో ఉన్నవారిని అన్నివిధాలా ఆదుకోవడమే నిజమైన మతమని ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. బిషప్‌గా జయరావు పట్టాభిషేకం పొంది మంగళవారంతో పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్‌లో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీతో కలిపి నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బిషప్ జయరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఏలూరు పీఠం యువత విభాగానికి చెందిన యువతీ యువకులు, యువ గురువులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ క్రైస్తవ్యమంటే ప్రేమ, సేవ అని సమాజంలో బడుగు, బలహీనులను, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి క్రైస్తవుడూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నగరంలోని యాచకులు, అన్నార్తులు 300 మందికి ఎస్ఆర్ సంజీవని హెల్పింగ్ హ్యాండ్స్, సోషల్ సర్వీస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తాతపూడి ఇమ్మానుయేల్ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాల్లో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, చాన్సలర్ ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ మద్దుల బాలస్వామి, సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ తదితర గురువులతో పాటు రెడ్ క్రాస్ ప్రతినిధులు డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, కార్యదర్శి బి.బెన్నీ, పీఆర్ఓ పి.రమణారావు, మానవత సంస్థ ప్రతినిధి మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా చిన్నారులను ప్రోత్సహిస్తూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా మంచి విద్యను అందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏలూరు నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు అర్బన్ ఐసీడీఎస్ పరిధిలో 36, 40, 44 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. మూడేళ్లునిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలోనూ, ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్థాయిని సంతరించుకున్నాయని, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులకు పౌష్టికాహారం, మంచి విద్య అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విమలాదేవి పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రహదారుల నిర్మాణం



కంద్రిక నర్సింహపురంలో రూ. 2.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: రహదారుల అభివృద్ధి, నిర్మాణం, ప్రజాసౌకర్యం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని దీని కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా నిధులు మంజూరు చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఖంద్రికనర్సింహపురంలో సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాలకు ధీటుగా గ్రామ శివారు ప్రాంతాల్లో అభివృద్ధి చేశామన్నారు. త్వరలో నియోజకవర్గంలో మిగిలిన రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. మలకచర్ల, కంద్రికనర్సింహపురం, గండివారిగూడెం వాసుల ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉండేలా రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణిసుధీర్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ గ్రామ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, కనికెళ్ళ పెద్దిరాజు, నాయకులు పర్వతనేని నరేంద్ర, ఉపసర్పంచ్ ప్రత్తిపాటి ముకుంద, సరిపల్లి కుటుంబరావు, మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ల మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఉన్నారు.

స్వచ్ఛమైన నీటి సరఫరా

ద్వారకాతిరుమల: స్థానిక తూర్పువీధిలో మంచినీటి బోరుకు మరమ్మతులు పూర్తికావడంతో మంగళవారం నుంచి ఆ ప్రాంతవాసులకు కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుతోందని పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని అన్ని ప్రాంతాలకు పుష్కలంగా నీరు అందుతోందన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	05
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	06
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	25
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

బిందు సేద్యం వైపు రైతుల మొగ్గు



జగన్నాథపురంలో బిందు సేద్యం విధానంతో సాగు చేస్తున్న దృశ్యం

పెదవేగి : సాగుకు అధిక సంఖ్యలో బిందు సేద్యంపై రైతులు మొగ్గుచూపుతున్నారు. మండలంలోని జగన్నాథపురంలో అధిక విస్తీర్ణంలో రైతులు బిందుసేద్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. దీనికి తోడు అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం అధిక శాతం సబ్సిడీపై డ్రిప్‌లను అందిస్తోంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయో లేక నిరాశపరుస్తాయో తెలియని అయోమయ స్థితిలో ఉన్నందున మొక్కజొన్నకు అధిక శాతం బిందు సేద్య విధానానికి మొగ్గు చూపామన్నారు. దీంతో నీరు వృథా కాకుండా సక్రమంగా మొక్కను సంరక్షించవచ్చని అన్నదాతలు తెలిపారు.

రక్తదాత.. స్ఫూర్తి ప్రదాత

ఏలూరు టౌన్ : రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు, ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితిల్లో ఉన్న రోగులు, గర్భిణుల ప్రాణాలు కాపాడేందుకు రక్తం ఎంతో అవసరం. వీరికి పలువురు రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుతూ స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారు. యువత రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. నేడు రక్తదాతల దినోత్సవం సందర్భంగా.. అత్యధిక సార్లు రక్తదానం చేసి వారి మనోగతం ఇలా ఉంది.

సామాజిక సేవపై ఆసక్తి



ఉట శ్రీనివాసరావు

తూర్పుగోదావరి జిల్లా పసలపూడికి చెందిన ఉట శ్రీనివాసరావు ఏలూరు జిల్లా చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. సామాజిక సేవ పట్ల ఆసక్తితో ఆయన ఇప్పటికి 80 సార్లు రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయటం ద్వారా వారి ప్రాణాలు రక్షించటం ఆత్మ సంతృప్తి నిస్తోందని చెబుతున్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మూడు నెలలకు ఒకసారి క్రమంతప్పకుండా రక్తదానం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాన్ని చూసి చలించిపోయా



సీహెచ్ రామకృష్ణ

ఏలూరు నగరానికి చెందిన సీహెచ్ రామకృష్ణ గత రెండు దశాబ్దాలుగా 78 సార్లు రక్తదానం చేసి అనేక మంది ప్రాణాలను రక్షించారు. 20 ఏళ్ల క్రితం ఆయన స్వస్థలం ఉంగుటూరు నుంచి ఏలూరుకు జూట్‌మిల్లులో పనిచేసేందుకు వస్తుండగా జాతీయ రహదారిపై ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. ఆయన మోటారు సైకిల్‌ను పక్కన పడేసి వెళ్లి క్షతగాత్రులను రక్షించే ప్రయత్నం చేశారు. దుస్తులన్నీ రక్తంతో తడిచిపోగా, అవే బట్టలతో జూట్‌మిల్లుకెళ్లారు. ఆ రోజు ఘటనతో చలించిపోయిన రామకృష్ణ నేటికీ రక్తదానం చేస్తూనే ఉన్నారు. ఆయన జిల్లా కోర్టు ద్వారా ఏలూరు జిల్లా జైలులో పారాలీగల్ వలంటీర్‌గానూ మూడేళ్లపాటు విశేష సేవలందించారు.

శాశ్వత భూ హక్కు, భూరక్షతో వివాదాలకు చెక్



మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ బీఎస్‌వీ శ్రీనివాస్, తహసీల్దార్ షంషాద్దీన్, సర్పంచ్ నాగేశ్వరరావు

భీమడోలు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కా రం లభిస్తుందని స్థానిక సబ్ రిజిస్ట్రార్ బీఎస్‌వీ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం కోడూరుపాడులో జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకంలో స్వమిత్వ గ్రామ కంఠం భూములను రీసర్వే చేసి 25 సర్వే నంబర్లను గ్రామ సచివాలయాల్లో ప్రచురించారు. భూహక్కుదారులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ బీఎస్‌వీ శ్రీనివాస్, ఇన్‌చార్జి తహసీల్దార్ షంషాద్దీన్ పాల్గొని ప్రసంగించారు. ఉంగుటూరు నియోజకవర్గంలోనే కోడూరుపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేసి అత్యాధునిక పద్ధతుల్లో వ్యవసాయ, వ్యవసాయేతర భూములను సర్వే చేశామన్నారు. గ్రామ కంఠం భూములకు యాజమాన్య హక్కులతోపాటు ప్రజల ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు వారి పేరున పట్టాలు పొందడానికి వీలు కలుగుతుందన్నారు. గ్రామ సచివాలయం స్థాయిలో రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. తొలుత రైతులు, ప్రజల అనుమానాలను నివృత్తి చేసారు. ప్రతి భూ హక్కుదారుడు ఈకేవైసీ చేసుకోవాలన్నా రు. అనంతరం తుది ప్రచురణ చేస్తామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెదవేగి : విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానకిఇ మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పెదవేగిలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం ఎదుట గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన ఏఈ నాగేషు మంగళవారం 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో పెదవేగి పాత సొసైటీ కార్యాలయం ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య తొలగనుందని ఏఈ తెలిపారు.

ఆర్వో యూనిట్ ప్రారంభం

దెందులూరు: గ్రామస్తులందరికీ సురక్షితమైన తాగునీటి లక్ష్యంగా దాతలు ఆర్వో ప్లాంటును నిర్మించడం అభినందనీయమని చల్లచింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అన్నారు. మంగళవారం కొత్తకమ్మవారిగూడెంకు చెందిన దాత వాకలపూడి గిరిబాబు రూ.5 లక్షలు, మాండలీజ్ సంస్థ రూ.5 లక్షలతో చల్లచింతలపూడిలో నిర్మించిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. దాత వాకలపూడి గిరిబాబు సేవాగుణాన్ని సర్పంచ్, అతిథులు అభినందించి సత్కరించారు. మాండలీజ్ మేనేజర్ రామచంద్రన్, రవీంద్రరావు సంస్థ నిబంధనల కనుగుణంగా గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో జనభగీదారి

ద్వారకాతిరుమల: ఐసీడీఎస్ జంగారెడ్డిగూడెం ప్రాజెక్టు పరిధిలోని ద్వారకాతిరుమల సెక్టారులో జన భగీదారీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రీస్కూల్ అభివృద్ధి గురించి, పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల, భాషా, సాంఘికాభివృద్ధి, గణితాభివృద్ధి, సంసిద్ధత తదితర అంశాలను పిల్లల తల్లిదండ్రులకు జీఎంఎస్‌కే సూపర్‌వైజర్ మేరి క్షుణ్ణంగా వివరించారు. గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూళ్లలో అడ్మిషన్ల వెల్లువ

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పిందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆరో తరగతిలో చేరే విద్యార్థులు అడ్మిషన్ల కోసం హైస్కూళ్లకు క్యూ కట్టారు. నాడు-నేడుతో పాఠశాలలు రూపురేఖలు మారడం, ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడం, గోరుముద్ద, విద్యాకానుక, అమ్మ ఒడి తదితర పథకాల సక్రమ అమలును తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ బడుల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు క్యూ కడుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ పాఠశాల ల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు నా ణ్యమైన విద్య అందించడంతో తల్లిదండ్రుల ఆలోచనలో మార్పు వచ్చింది. డబ్బులు పోగొట్టుకుని ప్రై వేటు పాఠశాలల్లో చిన్నారులను చేర్పించే కన్నా పిల్లలను తీర్చిదిద్దడంలో ప్రభు త్వం చేస్తున్న కృషి నచ్చి వారిపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు తల్లిదండ్రులు అంటున్నారు. ఉంగుటూరు, నారాయణపురం, చే బ్రోలు, కైకరం, బాదంపూడి, గొల్లగూడెం, రాచూరు హైస్కూళ్లలో విద్యార్థులు గణనీయంగా చేరుతున్నారు.

పామాయిల్ తోట దగ్ధం

దెందులూరు: దెందులూరులో రెండెకరాల పామాయిల్ తోట దగ్ధమైంది. మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ దగ్ధమైన పామాయిల్‌తోటను పరిశీలించారు. పెద్దిశెట్టి ఉమామహేశ్వరరావు, ప్రభాకర్‌కు చెందిన రెండున్నర ఎకరాల్లో ఉన్న పామాయిల్ పంటపై ఉండగా సమీప రైతు పొలంలోని వరిచేల దుబ్బులకు మంట పెట్టడంతో దగ్ధమైందని బాధిత రైతులు వివరించారని మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన వెలగపూడి శంకర్‌బాబు, శ్రీదేవి దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్

ద్వారకాతిరుమల: రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని మద్దులగూడెంలో మండల పరిషత్ నిధులు రూ.13 లక్షలతో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని అన్నారు. పేద ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి జగనన్న పాటుబడుతుంటే, అసలు అభివృద్ధే జరగడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలతో పాటు, సీసీ రోడ్లు, బోర్లు తదితర నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు కళ్లు తెరచి జరుగుతున్న అభివృద్ధిని చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనను కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో సైతం జగన్‌కు పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, స్థానిక సర్పంచ్ చెలికాని ప్రవీణ్, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సొసైటీ చైర్ పర్సన్‌లు చెలికాని సంజయ్, భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్‌కుమార్, మానుకొండ ప్రసాద్, పసుపులేటి ఏసుబాబు, పెద్దిన దిలీప్ తదితరులున్నారు.